క్లుప్తంగా

స్వామివారి సేవలో కేడీసీసీబీ చైర్‌పర్సన్



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆమె నాగ పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామి వారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్లు రావి రాంప్రసాద్, గరికిపాటి గోవిందరాజులు, అరజా లక్ష్మీ తులసి, అరజా నరేంద్రకుమార్, మోర్ల శ్రీనివాసరావు, కేడీసీసీ మోపిదేవి బ్రాంచి ఇన్‌చార్జి మేనేజర్ డి. జాన్సీ రాణి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విశ్వనాథపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ పాండురంగారావు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, సంక్షేమ లబ్ధిని వివరించి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

రేపు పల్లిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

కృత్తివెన్ను: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం పల్లిపాలెం పంచాయతీ పరిధిలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

పంజాలో అన్నదానం

గూడూరు: మొహర్రంను పురస్కరించుకుని గూడూరులోని బారాఇమామ్ పంజాలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బారాఇమామ్ పంజా కమిటీ అధ్యక్షుడు సాహెబ్, కార్యదర్శి మున్వర్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తబర్రుక్ పంపిణీ చేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ
ముగ్గురికి గాయాలు

నడకుదురు(చల్లపల్లి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం నడకుదురులో ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పురిటిగడ్డ శివారు నిమ్మగడ్డకు చెందిన విశ్వనాథపల్లి సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న నాగాయలంక మండలం ఎదురుమొండి గ్రామస్తుడు ఆరేవ రపు రాంబాబు, నడకుదురు గ్రామస్తుడు ఆరేవ రపు వెంకటేశ్వరరావుకు గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో సురేష్ పరిస్థితి విషమంగా ఉంది.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

పామర్రు: వర్షాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని జమీగొల్వేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు తులుమిల్లి వర ప్రసాద్‌బాబు సూచించారు. పామర్రులోని తమ్మాకోటమ్మరెడ్డి పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో సీజనల్ వ్యాధులు–జాగ్రత్తలు అనే అంశంపై మానవత సమావేశంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను అందజేశారు.

సవరణ

నా స్థలములట్టు కొలుసు సోమశేఖర సాయి & అందె శ్రీనివాసరావు గార్ల సంబంధించి మేర ది. 30.7.23న సాక్షి పత్రికలో ఇచ్చిన ప్రకటన నందు షెడ్యూలు స్థలం చ. గ.॥ 558 బదులుగా చ. గ.॥ 588గా చదువు కొనగలరు.
పసుపులేటి సూర్యప్రకాష్, అడ్వకేట్, మచిలీపట్నం.

రైతులకు అన్నివిధాలా అండ

- చుక్కల భూములకు చక్కని పరిష్కారం
- ఆపద్బంధువుగా ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- 22ఏ నుంచి 6,196.32 ఎకరాల తొలగింపు
- 3,172 మంది రైతు కుటుంబాలకు మేలు
- రైతు సంక్షేమ పథకాలతో భరోసా



ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

నాగాయలంక: దివిసీమ రైతులకు జగనన్న ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. షరతులుగల పట్టాల భూములను రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత భూముల జాబితా నుంచి విముక్తి కల్పించడంతో నాగాయలంక మండలంలో అత్యధికమంది రైతులకు మేలు చేకూరింది. ప్రభుత్వ జీఓ 22ఏ నుంచి 6,196.32 ఎకరాలు తొలగించడంతో మండలంలోని 9 గ్రామాల పరిధిలో గత ప్రభుత్వ నిర్ణయంతో అన్యాయానికి గురైన 3,172 మంది రైతు కుటుంబాలకు మేలు చేకూరింది.

రైతు భరోసా, పీఎం కిసాన్‌తో పెట్టుబడి భరోసా

మండలంలో వైఎస్సార్ రైతు భరోసా కింద అర్హులైన 6,926 మంది రైతులకు మూడేళ్లలో మొత్తం రూ.15.58 కోట్ల లబ్ధి చేకూరింది. ప్రస్తుత ఖరీఫ్ సాగు ప్రారంభం నేపథ్యంలో అదనంగా రూ.3.81 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ అయ్యాయి. పీఎం కిసాన్ కింద 6,067 మంది రైతులకు రూ.10.92 కోట్లకు పైగా లబ్ధి చేకూరింది. ఈ ఏడాది రూ.1.21 కోట్లకు పైగా జమ అవుతోంది.

ఈ క్రాప్‌తో మేలు..

వైఎస్సార్ ఉచిత పంటల బీమా, విపత్తులలో ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రుణాలు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు పొందేందుకు ఆన్‌లైన్ పంట నమోదు రైతులకు ఎంతగానో మేలు చేస్తోంది. మండలంలో ఈ ఏడాది 16,264 ఎకరాల్లో వరి పంట, 7.840 ఎకరాల్లో మినుము పంట ఈ క్రాప్ నమోదు చేశారు. ఖరీఫ్‌లో మొత్తం 8,738 మంది రైతులకు గాను 6,868 (88 శాతం), రబీలో 4,707 మంది రైతులకు 4,589 (98 శాతం) ఈకేవైసీ పూర్తయింది.

వైఎస్సార్ యంత్రసేవతో ప్రగతి

మండలంలోని 16 ఆర్‌బీకేలు అనుబంధంగా రూ.1.15 కోట్లతో 16 కస్టమ్ హైరింగ్ సెంటర్లను గ్రూపు ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. ఈ ఖర్చులో రూ.57.27 లక్షలు కో–ఆపరేటివ్ బ్యాంక్ రుణం కాగా రూ.43.66 లక్షలు సబ్సిడీ సంయుక్త ఖాతాల్లోకి విడుదల చేశారు. దీనిలో భాగంగా 12 ట్రాక్టర్లు, 16 రోటోవేటర్లు, 13 స్ప్రేయర్లను అందించారు.

సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ..

ఆర్‌బీకేల ద్వారా 120 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు అందించారు. ఈ ఏడాది సబ్సిడీపై 50 క్వింటాళ్ల జీలుగ, 60 క్వింటాళ్ల పిల్లిపెసర, 16 క్వింటాళ్ల జనుము విత్తనాలు పంపిణీ చేశారు. ఖరీఫ్ కోసం 45 క్వింటాళ్ల ఎంటీయూ 1021 వరి విత్తనం సిద్ధం కాగా 240 క్వింటాళ్ల బీపీటీ 5,204 రకం వరి విత్తనానికి ఇండెంట్లు పంపారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద నాగాయలంక గ్రామంలో మూల విత్తన పంపిణీ జరిగింది.

దళారుల కట్టడి.. మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు

దళారుల కట్టడితో మండలంలో 40,996 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి రూ.8.37 కోట్లను రైతుల ఖాతాలో జమ చేశారు. మండలంలో 907 మందికి గాను 1,005 ఎకరాల పంటలకు రూ.60.33 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ అందింది. పంట నమోదుతో ప్రీమియం చెల్లించకుండా వైఎస్సార్ ఉచిత బీమా అమలు చేస్తోంది. మండలంలో ఈ ఏడాది 460 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేశారు.

కొత్త వెలుగు నింపారు



నాలాంటి వేలాది మంది రైతుల బతుకును టీడీపీ ప్రభుత్వం తలకిందులు చేస్తే జగనన్న మా జీవితాల్లో కొత్త వెలుగు తెచ్చారు. భావదేవరపల్లి ప్రాంతంలో మాకు 7.21 ఎకరాల భూమి ఉంది. మా తాత ద్వారా నాన్నకు, ఆయన నుంచి నాకు భూమి సంక్రమించింది.1920 నుంచి భూమిని సాగుచేసుకుంటున్నాం. శిస్తు కడుతున్నాం. తరచూ బ్యాంకుల్లో తనఖా పెట్టి పంట రుణాలు తీసుకున్నాం. మూడు తరాల మా భూమిని టీడీపీ 2016లో ప్రభుత్వ భూమిగా ప్రకటించింది. దీంతో బ్యాంకులు రుణం ఇవ్వలేదు. పంటలు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ ఆపేశారు. తనఖా పెట్టడం, అమ్ముకోవడం లాంటి అవకాశం కోల్పోయాం. చేతిలో భూములు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఎన్నో బాధలు పడ్డాం. చివరికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. ఇపుడు అన్ని హక్కులు వచ్చాయి. పైగా సంబంధిత ధ్రువపత్రాలను స్వయంగా అవనిగడ్డ వేదికపై సీఎం జగనన్న చేతుల మీదుగా తీసుకోవడం గొప్ప అనుభూతి మిగిల్చింది.

–ఎ.హరి మోహనరావు, రైతు, భావదేవరపల్లి

చుక్కల భూముల నిషేధంతో కుంగిపోయాం



2014లో భావదేవరపల్లి రెవెన్యూ పరిధిలోని చోడవరంలో ఆర్‌ఎస్ నం. 733–32లో 20 ఎకరాలు కొన్నా. 2016 వరకు రుణాలు, సౌకర్యాలు పొందాను. చంద్రబాబు కారణంగా 2017 నుంచి బ్యాంకు రుణాలకు పొలం పనికిరాదన్నారు. ప్రభుత్వం చుక్క పెట్టారని, దీనిపై రుణాలు ఇవ్వడం కుదరదన్నారు. అంతే క్రాప్ రుణాలు లేక ఇంటా బయటా అప్పులతో వ్యవసాయం భారమైంది. 2011లో అమ్మాయికి 5 ఎకరాలు కట్నంగా ఇచ్చిన భూమితో 2017 నుంచి ఇబ్బందులు తలెత్తాయి. పనికిరాని భూమి కట్నంగా ఇచ్చారంటూ గొడవలతో మానసికంగా కుంగిపోయాం. మళ్లీ ఇన్నాళ్లకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో కష్టాల నుంచి బయటపడ్డాం. ఇప్పుడు కో–ఆపరేటివ్ బ్యాంక్ రుణాలు తీసుకోగలిగి వ్యవసాయ పనులకు సంతోషంతో సిద్ధమయ్యా.

–బీసాబత్తుని ప్రసాద్, డీసీ మాజీ చైర్మన్, రైతు, నాగాయలంక

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

డిప్యూటీ మేయర్ విజయలక్ష్మి



విజయలక్ష్మి, వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న కార్పొరేటర్లు, సంఘం నాయకులు

మచిలీపట్నంటౌన్: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి అన్నారు. అఖిల భారతీయ యాదవ సంక్షేమ సంఘం మచిలీపట్నం నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఇటీవల డెప్యూటీ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి, ఆమె భర్త, మాజీ కౌన్సిలర్ వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ యాదవులు నగరంలో అధికంగా ఉన్నారని, అందరం ఐక్యంగా ముందుకు సాగితే అన్ని రంగాల్లోనూ రాణించగలుగుతారన్నారు. వ్యాపార రంగంతో పాటు రాజకీయ రంగంలోనూ అనేకమంది యాదవులు పలు పదవుల్లో రాణిస్తున్నారని చెప్పారు. విజయలక్ష్మీని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మన్నే శారద, కొలుసు విజయగంగ, నాలి శారద, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నే శేషారావు, నాలి మాధవరావు, రొండి కృష్ణ, యాదవ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పల్లపాటి వెంకట్రావు (చినబాబు), సంఘ గౌరవాధ్యక్షుడు బొర్రా శ్రీనివాస్ తదితరులు ఘనంగా సత్కరించారు.

నేడు పెడన కౌన్సిల్ సమావేశం

పెడన: పెడన పురపాలక సంఘం కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం ఉదయం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు కౌన్సిల్‌హాల్‌లో జరిగే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులతో పాటు అధికారులు కో–ఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు. మున్సిపల్ అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని ఆమె ఆదేశించారు అజెండాలో పొందుపరిచిన 19 అంశాలను ఈ సమావేశంలో చర్చిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ తెలిపారు.

సహకార వ్యవస్థ బలోపేతం

- ఎమ్మెల్యే సింహాద్రి, కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి
- పీఏసీఎస్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రమేష్‌బాబు, చైర్‌పర్సన్ పద్మావతి

మెరకనపల్లి(మోపిదేవి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సహకార వ్యవస్థ బలోపేతమైందని కేడీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. మండల పరిధి మెరకనపల్లి గ్రామంలో నూతన భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జిల్లాలో కేడీసీసీబీ శాఖల సొంత భవనాల నిర్మాణం వేగంగా సాగుతోందని చెప్పారు. దీనిలో భాగంగా మెరకనపల్లిలో రూ. 22.15 లక్షలతో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. రైతులకు మేలు చేసేందుకు ఆర్‌బీకే, సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. చదువుకుంటున్న రైతుల పిల్లలకు విదేశీ విద్య రుణంతో పాటు ఎకరాకు రూ. 8 లక్షల వరకు రుణం బ్యాంకుల ద్వారా అందిస్తోందని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి మాట్లాడుతూ తమ బ్యాంకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో 420 సొసైటీలు, 9 బ్రాంచీలతో 10 వేల కోట్ల టర్నోవర్‌తో దేశంలోనే 5వ స్థానంలో నిలిచిందన్నారు. 29 చోట్ల స్థలాలు కొనుగోలు చేసి సొసైటీ భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. మెడబలిమి మల్లికార్జునరావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ ముత్యాల వరలక్ష్మి, సర్పంచ్ యర్రంశెట్టి ధన రాజ్యలక్ష్మి, కొడాలి మార్కెట్ యార్డు చైర్మన్ వేమూరి వెంకట్రావు, బ్రాంచి మేనేజర్ డి. జాన్సీ రాణి, ఏజీఎం బాబూరావు, పలువురు సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు, రైతు నాయకులు, సొసైటీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడులు.. నలుగురి అరెస్ట్

పెడన: మండల పరిధి పుల్లపాడు గ్రామ శివారులో జరుగుతున్న కోడిపందేలపై పెడన పోలీసులు ఆదివారం మధ్యాహ్నం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.270 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వి. రవిచంద్ర కుమార్ తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా కోడిపందేలు, జూదం ఆడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ చెప్పారు.

సీఎస్‌ఆర్ నగర్‌లో ముగ్గురి అరెస్ట్..

కోనేరుసెంటర్: నగరం నడిబొడ్డున జరుగుతున్న కోడిపందేలపై చిలకలపూడి పోలీసులు ఆదివారం దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. చిలకలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీఎస్‌ఆర్ నగర్‌లో కొంతమంది కోడిపందేలు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిపై దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1500 నగదుతో పాటు ఓ పందెం పుంజును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

ముంపు పొలాల పరిశీలన

పెద్దారాయుడుతోట(మొవ్వ): ముంపునకు గురైన రైతులు అధైర్యపడవద్దని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కాజ–పెద్దారాయుడు తోట మధ్య ముంపునకు గురైన పంట పొలాలను ఎమ్మెల్యే కైలే ఆదివారం పరిశీలించారు. మార్గం మధ్యలో ఉన్న రైతులను కలిసి అక్కడి పరిస్థితులను తెలుసుకుని, రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముంపు నీరు వేగంగా దిగువకు పారుతుందని, జరిగిన నష్టంపై అంచనాలు వేయిస్తామన్నారు. ఈ నివేదికను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆదుకోవాలని కోరతామని చెప్పారు.

గొంతువాపు వ్యాధి ప్రాణాంతకం

- తొలకరి చినుకులతో పశువుల్లో తీవ్రం
- పసిరి మేత కారణం
- ముందస్తు వ్యాక్సిన్ తప్పనిసరి



పసిరి మేత మేస్తున్న పశువులు

కృత్తివెన్ను: తొలకరి చినుకులు ప్రారంభంలో పశువుల ఆరోగ్యంపై తీవ్ర దుష్పరిణామాలు చూపే వ్యాధులలో హెచ్ఎస్ (గొంతువాపు వ్యాధి) ఒకటి. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడ చూసినా పచ్చదనం కనిపిస్తోంది. ఈ పసిరి మేతలో ఉండే ప్యాశ్చురెల్లా మల్టోసిడా అనే బ్యాక్టీరియా కారణంగా పశువులకు గొంతు వాపు వ్యాధి సోకుతుంది. దీని ప్రభావం తీవ్రమైతే పశువు మృత్యువాత పడుతుంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం ప్రజలు పాడి రంగాన్నే నమ్ముకుని జీవిస్తున్నారు. పశువుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాక్సిన్‌ను పాడి రైతులు పశువులకు వేయించాల్సిన అవసరం ఉంది.

వ్యాధి లక్షణాలు..

అన్నిరకాల పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశాలున్నాయి. వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం 104 డిగ్రీలకు పైగా ఉంటుంది. సకాలంలో గుర్తించకపోతే వారం రోజుల్లోనే పశువు చనిపోవచ్చు. బలమైన పశువుల కంటే దూడలకు ఈ వ్యాధి త్వరగా సోకే ప్రమాదం ఉంది. వ్యాధి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హిమరైజిక్ సెప్టీసెమియా (హెచ్ఎస్) అనే వ్యాక్సిన్ ద్వారా వ్యాధిని నివారించవచ్చు.

అప్రమత్తం కావాలి..

వర్షాలు పడి పచ్చమేత అధికమవుతున్న తరుణంలో ఈ వ్యాక్సిన్‌ను వేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే వర్షాలు పడిన తరువాత మొలకెత్తే పసిరి మేతలోని చిగురుల్లో ఈ ప్రమాదకర బ్యాక్టీరియా దాగుంటుంది. దీంతో గడ్డిని తిన్న పశువులకు వ్యాధి సోకే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ముందస్తుగా వ్యాక్సిన్ పశువులకు వేయడం వల్ల వాటికి ఎలాంటి ప్రమాదం ఉండదని పశువైద్యులతో పాటు పాడి రైతులు కోరుతున్నారు.

జాగ్రత్త పడదాం..

రాష్ట్ర ప్రభుత్వం వెటర్నరీ వైద్యశాలల ద్వారా గోపాలమిత్రల సాయంతో గ్రామగ్రామానికి ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్లు పశువైద్యులు సుశాంత్ తెలిపారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయాల వద్ద వ్యాక్సినేషన్ కార్యక్రమాలు చేపట్టామని, మిగిలిన అన్ని గ్రామాల్లోనూ వ్యాక్సిన్ వేస్తామని వివరించారు. మండల వ్యాప్తంగా ఉన్న 7,200 గేదెలు, 1,460 ఆవుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రైతులు వ్యాక్సిన్లు వేయించాలని ఆయన కోరారు.

ముంపు బాధితులకు సరుకులు అందజేత

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం వెన్ననపూడి గ్రామంలో వర్షాల కారణంగా ముంపునకు గురైన దళిత కాలనీ వాసులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎంపీపీ పెయ్యల ఆదాం మాట్లాడుతూ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) నీట మునిగిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ఈ ఏర్పాట్లు చేశారన్నారు. నిత్యావసర సరుకులు లేక ఇబ్బంది పడుతున్న 70 కుటుంబాల వారికి ఈ కిట్లు పంపిణీ చేశామని వివరించారు.

దివ్యాంగులకు సేవ చేయడం వరం

ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: అనేక కారణాలతో అవయవాలు కోల్పోయిన దివ్యాంగులను చేరదీసి వారి జీవనం కొనసాగించడానికి అవసరమైన కృత్రిమ అవయవాలు అందజేయడం ఒక వరమని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులో మార్వాడీ సత్రంలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ.. ప్రస్తుతం కృత్రిమ అవయవాలు కొనుగోలు చేయడం ఎంతో ఆర్థికభారం పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి అవసరమైన కృత్రిమ అవయవాలు అందజేయడం భారత్ వికాస్ పరిషత్ గొప్పదనమన్నారు. గత 28 ఏళ్లగా సుమారు 1,800 పైబడి కృత్రిమ అవయవాలు ఏర్పాటు చేసిన గుడివాడ శాఖ సేవలు అభినందనీయమని చెప్పారు. తాను సైతం భారత్ వికాస్ పరిషత్ సభ్యుడనని రాష్ట్ర విభజన ముందు హైదరాబాద్‌లో భారత్ వికాస్ పరిషత్ కార్యాలయం ఉండేదన్నారు. అనంతరం దివ్యాంగుల సేవ కొరకు ఎక్కడా కార్యాలయం ఏర్పాటు చేయలేదని, భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ వారు భవన నిర్మాణం చేపడితే పట్టణంలో 500 గజాల స్థలం ఇప్పించేందుకు ప్రభుత్వంతో చర్చించి ఒప్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వాడరేవు కామరాజు, కీర్తిలాల్ జైన్, వికాస్ పరిషత్ అమరావతి కన్వీనర్ రూప్‌చంద్ జైన్, రాష్ట్ర నాయకులు చోడవరపు విజయకుమార్, గుడివాడ శాఖ అధ్యక్షుడు జ్ఞాన్‌చంద్ జైన్, కార్యదర్శి ఎస్.శేషగిరిరావు, కోశాధికారి హారిక, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య, ఉరిటి రామారావు, ఉమాకుమార్ పాల్గొన్నారు.